# నేనూ - వచనకవిత్వం

## మల్లిక్

ఈ వేళ ఆఫీసంతా ఒకటే గోల. ఎవరినోట విన్నా ఒకటే మాట.

"వెంకట్రావు చచ్చిపోయాడు."

"అబ్బో!... ఎలాంటి రచయిత!..."

"దేశానికి తీరనిలోటు అతను చనిపోవడం."

వెంకట్రావు చనిపోయినందుకు ఇంతమంది బాధపడ్తుంటే నాకనిపించింది అతను నిజంగా ధన్యజీవి అని.

ఈ ఆలోచన నాకు ఆ రాత్రంతా నిద్ర లేకుండా చేసింది.

అవును... నేను చస్తే అసలు బాధపడేవాళ్లు ఎవరైనా ఉంటారా బాధపడడం మాట ఎలా ఉన్నా మా యింటి యజమాని సంతోషిస్తాడు మరో పదో పాతికో అద్దె పెంచి మరొకరికి నా గది అద్దెకు ఇవ్వొచ్చని.

ఆఫీసులో నాతో పని చేసేవాళ్లు "అయ్యో! పాపం బుచ్చిబాబు పోయాడట!" అని కాస్సేపు విచారిస్తారు.

నా స్నేహితుడు చంద్రరావు మాత్రం కాస్త ఎక్కువగా బాధపడ వచ్చునేమో!!...

అదే పేరున్న ఏ రచయితో, సంగీత కళాకారుడో, కవో, డాన్సరో, నటుడో ఎవరైనా పోతే దేశం యావత్తూ బాధపడ్తారు. అదీ జన్మంటే.

తినడం, ఆఫీసుకు వెళ్లడం మళ్లీ యింటికి వచ్చి తినడం నిద్రపోవడం — ఏమైన అర్థం ఉందా ఈ జీవితానికి?

నాలాంటివాడు బ్రతికినా ఎవడికీ లెక్కలేదు చచ్చినా ఎవడికీ లెక్కలేదు. ఏం బ్రతుకు ఇది "థూ..."

"ఏయ్ మిస్టర్"

ఎవరో గట్టిగా అరిస్తే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను. నేను కూర్చుని ఉన్న కిటికీ దగ్గర ముఖం జేబురుమాలుతో తుడుచుకుంటూ కిటికీలోంచి ఎర్రగా చూస్తున్నాడు అతను.

నేను రెప్పలు పైకి ఎగరేశాను ఏమిటన్నట్లు.

"దారిన పోయే జనాన్ని చూసుకోకుండా అలా ఉమ్మేస్తే ఎలా?" గట్టిగా అరిచాడు అతను.

అతని అరుపుకి నాగదిలో తగిలించిన నా డిగ్రీపటం టప్పున క్రింద పడింది.

నా పొరబాటు అర్థం అయింది.

"సారీ... వెరివెరీ సారీ" అని కిటికీ తలుపులు మూసేశాను. మళ్లీ అతను అరిస్తే ఇంకా ఏమేం పడిపోతాయోనన్న భయంతో.

మళ్లీ రచయిత వెంకట్రావు గుర్తుకొచ్చాడు.

"ఎందుకొచ్చిన బ్రతుకు... థూ..."

"గది నిండా ఇలా ఉమ్మలూస్తే ఊశావేగానీ కాస్త రెండ్రోజులకో సారి పని మనిషితో కడిగించు."

నా గది గుమ్మం ముందు నిలబడి కోపంగా చూస్తూ అంటున్నాడు యింటి యజమాని.

* * *

మర్నాడు ఆదివారం కావడంతో కాస్త ఆలశ్యంగా లేచి కాఫీ పెట్టుకుని త్రాగి స్నానం చేసి చంద్రరావు దగ్గరికి బయలుదేరాను.

"ఏమిట్రోయ్ కళ్లంతా అలా ఎర్రగా ఉబ్బి ఉన్నాయ్?" అని అడిగాడు నన్ను చూస్తూనే చంద్రరావ్.

"రాత్రంతా నిద్రలేదు"

> **అంటే నీకు బుర్ర గోక్కుంటే అయిడియాలు వస్తాయన్నమాట. కాబట్టి నువ్వు కవిత్వం రాసేప్పుడు బుర్రగోక్కుంటూ రాస్తుండు...**

"ఏం? మళ్లీ ఎవరినైనా ప్రేమించావా లేకపోతే యింటాయనతో ఏదైన ట్రబులా?"

"అదేం కాదు" అంటూ దీర్ఘంగా నిట్టూర్చాను. ఆ గాలికి గోడకున్న క్యాలెండరు రెప రెప కొట్టుకుంది. చంద్రరావు క్రాపు రేగింది.

"చూస్తుంటే పెద్ద గొడవలానే ఉంది" అన్నాడు క్రాపు సర్దుకుంటూ.

"అవును... పెద్ద సమస్యే. రాత్రంతా ఆలోచించాను గానీ పరిష్కారం కనబడలేదు. నువ్వే మార్గం చూపించాలి" వాడిని పట్టుకుని గట్టిగా కుదుపుతూ అన్నాను.

"సర్లె సర్లె.... వదులు"

నేను వాడిని వదిలేసి దూరంగా జరిగాను. వాడి వైపు చూసిన నాకు ఆశ్చర్యం వేసింది.

"ఒరి చెంచిగా... నువ్వు మాజిక్కులెప్పుడు నేర్చుకున్నావ్‌రా"

"ఏం?" చంద్రరావు నాకంటే ఎక్కువ ఆశ్చర్యంగా చూశాడు.

"ఇందాక నేనొచ్చినప్పుడు నీ చొక్కా బావుంది. ఇప్పుడు ఒంటి మీద ఉన్నది ఉన్నట్టుగానే మొత్తం చిరిగిపోయి ఉందేమిటి?!"

చంద్రరావు ఓసారి తన చొక్కావైపు చూసుకుని గట్టిగా రంకె వేశాడు.

"మాజిక్కులా నా బొందా? ఇప్పుడు నువ్వు నన్ను పట్టుకుని గట్టిగా కుదిపినప్పుడు చిరిగిపోయి ఉంటుంది. అసలే పట్టుతప్పిన పాత చొక్కా కదా?"

వాడి చొక్కా చిరిగినందుకు నాకు చాలా బాధ కలిగింది. నా ముక్కు పొంగింది.

"నన్ను క్షమించరా" గభాలున వాడిని గట్టిగా కౌగిలించుకున్నాను.

"ఫర్ ర్ ర్..."

"ముందు నన్నొదల్రా" గట్టిగా అరిచాడు చంద్రరావు.

ఆ అరుపుకి గుండెలదిసి పోయి వాడిని వదిలేశాను.

తీరా వాడిని చూశాక నవ్వాగలేదు నాకు. నా బిగి కౌగిలికి వాడి చొక్కా మొత్తం ఊడొచ్చి వట్టి కాలర్ మాత్రం వాడి మెడలో ఉంది.

ఆ కాలర్‌కున్న బటన్ తీసి దూరంగా విసిరికొట్టి రుసరుసలాడుతూ లోపలికి వెళ్లి వేరే చొక్కా తొడుక్కుని వచ్చాడు చంద్రరావ్.

"ఇప్పుడు చెప్పు, ఏమిటి నీ సమస్య?"

"నేను పేరు సంపాదించాలి... ఎలాగైనా పది మందికీ నా పేరు తెలియాలి"

"అసలు నీకీ ఆలోచన ఎలా వచ్చింది?"

నేను చెప్పాను.

"భలే చిక్కు సమస్య తెచ్చావే..." బుర్ర గోక్కున్నాడు చంద్రరావు.

"అమ్మమ్మ... అలా అనకు. నీ కాళ్ల పట్టుకుంటా" వాడి వైపు రెండడుగులు వేశాను.

"ఏం? ఈ సారి నా ప్యాంటు చింపుదామనా?" కోరగా చూస్తూ వెనక్కు రెండడుగులు వేశాడు చంద్రరావు.

నేను లెంప లేసుకున్నాను.

"నన్ను కాస్త ఆలోచించనీ..."

రెండు చేతులూ వెనక్కు పెట్టుకుని అటూ ఇటూ తిరగసాగాడు చంద్రరావు.

"పోనీ నేను సంగీతం నేర్చుకుని మంచి సంగీత విద్వాంసుడిగా పేరు సంపాదించనా?... ఆ ... హిహిహి" చేతులు నలుపుకుంటూ అడిగాను.

"వద్దు... ఈ వయసులో నువ్వు సంగీతం ఎప్పుడు నేర్చుకుంటావ్ ఎప్పుడు పేరు సంపాదిస్తావ్? దానికి చాలా సంవత్సరాలు పడ్తుంది."

"పోనీ డాన్సు నేర్చుకుంటేనో? ఇంచక్కా గోపికృష్ణలానో... కనీసం కమలహాసన్ లానో..."

"షటప్... నీ కాళ్ల పొడవు. నువ్వు డాన్సు చేస్తే ఎక్కువ చేపలు తిన్న సంతోషంతో గెంతే కొంగలా ఉంటుంది"

వాడి కామెంట్‌కి నాకు చచ్చేంత ఒళ్లు మండింది. కానీ నా కోపాన్ని

అణుచుకున్నాను. అవసరం నాది మరి.

"నటుడిగా!..." మళ్ళీ ఏమంటాడోనని నసిగాను.

"ఊహు... నీ కదీ లాభం లేదు. ఆ టాలెంట్ నీలో కాస్త సహజంగా ఉండాలి. కాస్త తలనొప్పి నటించి మీ ఆఫీసరు దగ్గర పర్మిషను సంపాదించలేవు నువ్వు" విసుక్కున్నాడు.

"నవల్రాస్తే?!..."

చలపతి కెవ్వున కేకేసి నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు.

"ఫర్ ర్ర్..."

ఆ శబ్దానికి భయపడి నన్ను వదిలేసి నా వంక చూశాడు.

"అబ్బే నీ చొక్కా చిరగలేదా!!..."

తనవైపు చూసుకుని బేర్‌మని జుట్టు పీక్కున్నాడు.

"నిన్ను కౌగిలించుకున్నా నా చొక్కానే చిరిగింది."

"జరిగిందేదో జరిగింది. ఇంకెప్పుడూ అలా కౌగలించుకోమాకు"

వాడి చొక్కా పైకెత్తి వాడి కళ్ళు తుడిచాను.

'ఇంతకీ ఎందుకలా కెవ్వు మన్నావు?"

"నువ్వు నవల వ్రాయడం అన్నావు కదా? అది నీకు పనికి రానిదే గానీ అదే రంగానికి చెందిన మరొకటి ఉంది"

"ఏమిటి?... నాటకాలు రాయడమా?"

"ఛ... కాదు. కవిత్వం!... నీకు అఆలు వచ్చా?"

"ఓ.. అఆ, ఇఈ, ఉఊ..."

"ఛప్ నోర్ముయ్, వచ్చారావా అని అడిగాను. అప్పజెప్పమనలేదు."

"వచ్చు" అన్నాను.


"హుర్రా..." చంచ్రలావు రెండు చేతులూ చాపి నా దగ్గరికి రాబోయి తన చొక్కా చూసుకుని ఆ ప్రయత్నం మానుకుని "అలాగయితే కవిత్వం రాయడం మొదలు బెట్టు. కవిత్వం అంటే ఏ కవిత్వం అనుకున్నావ్? వచన కవిత్వం" అది చాల తేలిక. ఈ రోజుల్లో రోడ్డుమీద ఎక్కడ చూసినా వీళ్ళే. అందుచేత వచన కవిత్వం రాసి కవిగా పేరు సంపాదించు... నీకు గైడెన్స్ కోసం నిన్ను నాకు తెలిసిన వచన కవి పిచ్చుమణి దగ్గరికి పంపుతాను. ఓ ఉత్తరం రాసిస్తాను. ఆయనకు చూపించు. నీకు కవిత్వంలోని మెలుకువలన్నీ తెలుపుతాడు."

"యాహూ..." సంతోషం పట్టలేక గట్టిగా అరిచి చలపతిని కౌగలించుకున్నాను.

"ఫర్ ర్ ర్..."

మళ్ళీవాడి చొక్కా చిరిగింది.

వాడిని వదిలి దూరంగా జరిగి వాడి వంక చూశాను. చొక్కా పీలికలై క్రిందపడి ఉంది.




మెడలో మాత్రం చొక్కా కాలరు మిగిలి ఉంది.

* * *

చిన్న పెంకుటిల్లు అది.

ఫెన్సింగ్ గేటు తోసుకుని లోపలికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. కొన్ని క్షణాల తరువాత తలుపు తెరుచుకుంది.

జులపాల జుట్టుతో శాలువా కప్పుకుని

ఉన్నాయన తల బయటికి పెట్టి.

"ఎవరు కావాలి
కావాలి ఎవరు
ఎవరో ఒకరంటావా
ఆ ఎవరు ఎవరో చెప్పాలి" అన్నాడు.

నేను తారెత్తి పోయాను. గబగబ పరుగెత్తి ప్రక్కకి వెళ్లి ఇంటి నెంబరు చూశాను. చంద్రలావు ఇచ్చిన నెంబరు అదే.

"ఏమిటో కంగారు
చెప్పవా నా బంగారు"

గబగబ నావెనకాలే అతను కూడా వచ్చి అన్నాడు.

"పిచ్చుమణి గారి ఇల్లు ఇదేనాండీ?" కాస్త వణుకుతూ అడిగాను.

"నా కవిత్వం మణి
కవుల్లో నేను మణి
ఇంతకీ ఏమిటి నీ పని
నా పేరే పిచ్చుమణి"

అన్నాడు పిచ్చుమణి వచన కవిత్వం చదివే స్టయిల్లో.

"మీతో పని ఉండి..." నసిగాను

"లోపలికి రండి... రండి రండి లోపలికి"

ఇద్దరం వరండాలో కుర్చీల్లో కూర్చున్నాం.

"ఏం పని... నాపేరే పిచ్చుమణి. ఏం పని నాపేరే పిచ్చుమణి" అన్నాడు పిచ్చుమణి శాలువ సవరించుకుంటూ

నేను చంద్రలావు ఆయనకు రాసిన ఉత్తరం ఇచ్చాను.

పిచ్చుమణి ఉత్తరం అంతా చదివాడు.

"ఉత్తరం చూశారు కదండీ... మరీ మీ సహాయం..." ముందుకు వంగుతూ కుతూహలంగా అడిగాను.

"ఉండుండు— చదవనీ మరోసారి ఉత్తరం. ఉండుండు చదవనీ మరోసారి ఉత్తరం."

"ఎందుకండీ మీరు ఒక్కో వాక్యాన్నీ, రెండ్రెండు సార్లు అంటారు?"

"వచన కవులు అంతే నాయనా. ఒక్కో వాక్యాన్నీ రెండు రెండుసార్లు అంటారు. కవి సమ్మేళనల్లో పాల్గొనీ పాల్గొనీ అలా అలవాటై పోతుంది నాయన."

అలా అని నోటిమీద చెయ్యిపెట్టి కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూసి గబుక్కున క్రిందికి వంగి ఏదో తీసి ప్రక్కకి తిరిగి నోట్లో పెట్టుకుని "హిహిహి" అన్నాడు.

బావుండదని మార్యాదకి నేనూ హిహిహి అన్నాను.

చంద్రలావు రాసిన ఉత్తరం మళ్లీ చదివి హఠాత్తుగా క్రిందపడి పోయాడు పిచ్చుమణి.

నాకు కంగారు పుట్టి క్రిందికి వంగి చూసి తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.


పిచ్చుమణి గుక్కపట్టి నవ్వుకున్నాడు. అలా ఒక రెండు నిముషాల పాటు నవ్వి గుండెల మీద చెయ్యివేసుకుని "హబ్బ... హమ్మ... భలే జోకేశావయ్యా. కవిత్వం రాయడం ఒకరు చెప్పాలయ్యా? తోచింది రాసెయ్యడమే"


"ఏదో మీకు అనుభవం ఉంది కదా? కాస్త మెలుకువలు నేర్పుతారనీ"

"అలాగే చెప్తా... అలాగే చెప్తా... హహహ..," అని గబుక్కున క్రిందికి వంగి ఏదో తీసి నోట్లో పెట్టుకున్నాడు.

"ఊ... ఇప్పుడు చెప్పు. కవిత్వం రాయడం నేర్పాలంటావ్? రాయడం నేర్పాలంటావ్?"

"అవునండీ... అవునవునండీ"




"చూశావా చూశావా? నా ఎదురుగా కూర్చుంటే నీకు కవిత్వం ధోరణి వచ్చేస్తుంది... హోహోహో..."

"హిహిహి..." నాకూ కవిత్వం వస్తుందన్న సంతోషంతో నవ్వాను.

"దీని సిగ తరగ..." క్రిందికి వంగి కుర్చీ క్రింద నుండి ఏదో తీసి నోట్లో పెట్టుకున్నాడు పిచ్చుమణి.

ఏమిటబ్బా ఇతను ఇందాకట్నుండీ క్రింద నుండి ఏవో ఏరుకుని నోట్లో పెట్టుకుంటున్నాడు. బఠానీలా, శనగలా?

"ఏమిటండీ ఇందాకట్నుండీ క్రింద నుండి ఏదో తీసి నోట్లో పెట్టుకుంటున్నారు? బఠాణీలా?" కుతూహలం పట్టలేక అడిగాను. బఠాణీలు క్రింద జల్లి ఏరుకుని తింటే కవులకి మూడ్ వస్తుందేమో కనుక్కో వద్దూ?

నా మాట వింటూనే పిచ్చుమణి పగలబడి నవ్వాడు.

"భలే సందేహం వచ్చిందయ్యా నీకు... దీని సిగతరగా మళ్లీ పడిపోయింది" అని కుర్చీ క్రిందికి దూరి మళ్లీ తీసి నాకు చూపించి "ఇది కట్టుడు పన్నయ్యా బాబూ. కాస్త గట్టిగా నవ్వితే ఊడి పడిపోతుంది. ఇందాకటి నుండీ క్రింద పడిపోతుంటే దీన్నే క్రింద నుండి తీసి పెట్టుకుంటున్నా" అని ఆ కట్టుడు పన్నుని యధాస్థానంలో పెట్టేశాడు.

"ఇంతకీ వచన కవిత్వం ఎలా రాయాలో చెప్పాలంటావ్? ముందు నీ మనసుకు తట్టిన భావం వచనంలో కాగితం మీద రాసేస్కో. ఆ వచనంలోని ఒక్కో వాక్యాన్ని ముక్కల క్రింద విరిచేసి ఒకదాని క్రింద ఒకటి పేరిస్తే అదే వచన కవిత్వం"

"హబ్బా... చాలా సులభంగా ఉందండీ..." గుండెల మీద చెయ్యేస్కున్నాను.

"ఇప్పుడు నీకు తోచిన వాక్యం. ఏదైనా చెప్పు!"

నేను బుర్ర గోక్కున్నాను.

"ఒక పువ్వు వికసించింది. దాని చుట్టూ తుమ్మెద తిరిగింది." అన్నాను రెండు క్షణాలు ఆలోచించి.

"శభాష్... చూశావా నీకు బుర్ర గోక్కుంటే అయిడియా వచ్చింది. అంటే నీకు బుర్ర గోక్కుంటే అయిడియాలు వస్తాయన్నమాట. కాబట్టి నువ్వు కవిత్వం రాసేప్పుడు బుర్ర గోక్కుంటూ రాస్తుండు... ఆ మళ్లీ ఆ వాక్యం చెప్పు" అన్నాడు పిచ్చుమణి.

"ఒక పువ్వు వికసించింది. దాని చుట్టూ తుమ్మెద తిరిగింది"

"ఇప్పుడు దీన్ని వచన కవిత్వంగా మార్చేస్తాచూడు" అని ప్రక్కనున్న దువ్వెన తీసి దాంతో వీపు గోక్కోవడం మొదలు బెట్టాడు.

"నీకు బుర్రగోక్కుంటే ఆలోచనలు ఎలా వస్తాయో నాకు వీపు గోక్కుంటే అలా వస్తాయ్" అని నవ్వాడు పిచ్చుమణి. మళ్ళీ క్రిందపడి పోయిన కట్టుడు పన్ను తీసి పెట్టుకుని రెండు నిముషాలు ఆలోచించి, నాలుగు నిముషాలు వీపు గోక్కుని "ఇప్పుడు విను" అన్నాడు.

పిచ్చుమణి గొంతు సవరించుకుని చదివాడు.

"ఒకపువ్వు వికసించింది
వికసించిందొక పువ్వు
దాని చుట్టూ గిర, గిర
గిరగిర తిరిగింది
ఒక తుమ్మెద
తిరిగి తిరిగి పువ్వును

'మరిగిందొక తుమ్మెద
ఒక పువ్వు వికసించింది.''

అంటూ చదవడం ఆపి నా వైపు చూసి కళ్లు ఎగరేశాడు. ''ఎలా ఉంది?''

''చాలా బావుందండీ'' అన్నాను.

''నేను మామూలుగా చదివేశాను గానీ ఇదే స్టేజీ మీదైతే ఒక్కోవాక్యాన్నీ రెండేసి మార్లు చదవాలి. గుర్తుంచుకో. కవి సమ్మేళనల్లో ఒక పంక్తిని చదివిన తరువాత వెనక్కి తిరిగి బాగా పేరున్న పెద్ద కవి వైపు చూసి చిర్నవ్వు నవ్వాలి. అతగాడు ఊరికే కూర్చుంటే బావుండదని తనూ చిరునవ్వు నవ్వి ''బావుంది బావుంది'' అంటాడు. ఒక్కడే బావుందని మనమంతా ఊరుకుంటే మర్యాదగా ఉంటుందా? అని అనుకుని స్టేజిమీద ఉన్న మిగతా కవులంతా తలలు ఊగిస్తూ ''బావుంది బావుంది'' అంటారు నిన్ను చూసి అంతమంది కవులు బావుందని అంటుంటే దాంట్లో ఏదో గొప్పభావం ఉండకపోయి ఉంటుందా అని కవి సమ్మేళనానికొచ్చిన తలమాసిన వాడెవడో చప్పట్లు కొడతాడు. మాకేనా తలమాయనిది అని కోపగించుకుని మిగతా వాళ్లు చప్పట్లు కొడతారు. దాంతో హాలంతా చప్పట్లమోత. అప్పుడు ఆ పంక్తిని రిపీట్ చేసి ముందుకి వెళ్తావ్...''

''బావుంది బావుంది'' అని సంతోషంగా తల ఊపాను నేనూ.

''తరువాత రెండో పంక్తిని చదివి మళ్లీ వెనక్కి తిరిగి పెద్దకవిని చూసి చిర్నవ్వు నవ్వుతావ్... అంతే మళ్లీ ఇందాక చెప్పిన దంతా వరస తప్పకుండా జరుగుతుంది. ఆ కవి సమ్మేళనంలో చప్పట్లన్నీ నీకే... ప్రేక్షకులు మార్కులన్నీ నీకే....''

నేను సంతోషం పట్టలేక చప్పట్లు కొట్టాను.

పిచ్చుమణి మళ్లీ చెప్పడం మొదలు బెట్టాడు.

''సీజన్ బట్టి కవిత్వం రాయాలి. ఉగాది వచ్చిందనుకో... వచ్చింది ఉగాది అంటూ రాసెయ్యాలి. ఎండాకాలం వస్తే ఎండలు ఎండలు, మండే ఎండలు అంటూ రాసి పడెయ్యాలి. అంతేకాదు. ఎప్పుడూ ఇలాంటి కవిత్వమే రాస్తే నీకు సామాజిక స్పృహ లేదని అంటారు. అందుకే రిక్షావాడిమీద, గుడిసెల్లో ఉండేవాళ్ల మీద ''ఓ పేదవాడా... నువ్వుండేది మురికివాడా'' అంటూ కవిత్వం రాయ్. వీలున్నప్పుడల్లా చంపుతా, నరుకుతా అను''

''అదేమిటండీ!'' ఆశ్చర్యపోతూ అడిగాను.

''దాన్ని విప్లవ కవిత్వం అంటారు. ఇహపోతే మినీ కవితలు గురించి. మన రాజధాని గోడల మీద చూడు... ఎన్ని స్లోగన్లో... ముందు అవి బాగా చదువు. అవన్నీ మినీ కవితలే...''

''బస్సులో వెళ్లేటప్పుడు నేను రోజూ వాటిని చదువుతానండీ'' అన్నాను.

''ఏదీ... అయితే ఆ అనుభవంతో ఒక మినీ కవిత ఆశువుగా చెప్పు చూద్దాం.''

''కవిత్వం రాయడంలోనే అనుభవం లేదు. ఇక ఆశువుగా ఎలాచెప్పగల నండీ'' నసిగాను.

''ఒరి నీ అమాయకత్వం కూలా హ్హహ్హహ్హ... దీని తస్సచెక్క... మళ్లీ క్రింద పడిపోయిందయ్యా...''

క్రింద నుండి కట్టుడు పన్నుతీసి పెట్టుకున్నాడు.

''మినీ కవిత్వం రాయడానికిగానీ ఆశువుగా చెప్పడానికి గానీ అనుభవం కావాలటయ్యా... ఇప్పటి కిప్పుడు నే చెప్తా చూడు...''

ఓసారి దువ్వెనతో వీపు గోక్కుని

''బడికి వెళ్తే బలపం
గుడికి వెళ్తే గిలపం'' అన్నాడు.

''గిలపం అంటే ఏమిటండీ?

''గిలపం అనే పదం లేదు. కానీ ప్రాసకోసం మనం అలా అంటాం. దానికి ప్రేక్షకులు లేదా పాఠకులు కర్పూరంగా అర్థం చెప్పకుంటారు. అలా మనకి కొన్ని కొత్త పదాలు సృష్టించే స్వేచ్ఛ ఉంది.

నాకు హుషారు పుట్టింది

''నేను కూడా ఓ మినీ కవిత్వం చెప్తానండీ'' అన్నాను.

''చెప్పు చెప్పు''

''ఇడ్లీకి జత సాంబారు''
దేవాదాసుకి జత బీరు బారు''

అన్నాను బుర్ర గోక్కుంటూ

పిచ్చుమణి చప్పట్లు కొట్టాడు.


''నీకు కవిత్వం ఎలా రాయాలో అర్థం అయిపోయిందయ్యా. ఇంక నేను చెప్పేది ఏముంది?''

నేను కుర్చీలోంచి లేచాను.

''మరో విషయం నువ్వు కాస్త మంచి కవివి అనిపించు కోవాలంటే నాలా ఇలా సిల్కు లాల్చి వేసుకుని, మీద కాశ్మీరు శాలువా కప్పుకోవాలి'' అన్నాడు.

''అలాగే నండీ'' వినయంగా తల ఊగించాను.

పిచ్చుమణి ఇంట్లోపలికి చూస్తూ ''ఒసేవ్ ముండా... ఈ పెద్దలమ్మి కొడుకు ఎక్కడికి వెళ్ళాడు? చిన్నముండా కొడుకు ఇందాకనగా నా సిగరెట్లు తేడానికి వెళ్లాడు. ఇంకా ఇంటికి చావలేదా? పనిమనిషి లంజ ఈవేళ రాలేదన్నావు? కాలెండర్లో గుర్తుపెట్టుకుని ఫస్టుకి దాని జీతం కట్‌చెయ్... దానెమ్మ...''




నేను బిక్క చచ్చిపోయాను. హఠాత్తుగా పిచ్చుమణికి ఏమైంది?...

పిచ్చుమణి నావైపు తిరిగి ''మరేమీ అనుకోకోయ్... కవిత్వం విషయం మాట్లాడేటప్పుడే నేను మామూలుగా మాట్లాడతాను. మిగతా టైమంతా నేను మాట్లాడేది ఈ భాషే... హహహ...''

క్రిందకి వంగాడు కట్టుడు పన్ను తీసుకోవడం కోసం.

''నేనిహ వస్తానండీ!...'' అన్నాను అయోమయంగా

''మంచిది'' అన్నాడు పన్ను తగిలించుకుంటూ పిచ్చుమణి.

నేను గుమ్మం దాటగానే నా వెనకాల తలుపులు ధబేల్ అని మూసుకున్నాయ్.

''మాయదారి సంత... ఊరికే వచ్చి డిస్టర్బ్ చేస్తారు'' అన్న మాటలు తలుపులు మూసుకోడానికి క్షణం ముందు వినిపించాయి నాకు.

* * *

పిచ్చుమణి దగ్గరికి వెళ్లిన రోజునుండీ నేను అదే పనిగా కవిత్వం రాయడం మొదలు బెట్టాను.

ఆఫీసులో లంచ్ టైంలో అందరూ తింటున్న సమయంలో గట్టిగా గొంతెత్తి నా కవిత్వం చదువుతూ వాళ్లకి వినిపించేవాడిని. వాళ్లు ఇప్పుడు నా గదిలో కాక ఎక్కడికో పోయి లంచ్ చేస్తున్నారు. నాకు పరిచయస్తులు కూడా నేను ఎదురుపడితే ఇదివరకు నవ్వి పలకరించేవారు ఇప్పుడు ముఖం చాటేసి నన్ను చూడనట్టు వెళ్లిపోతున్నారు. కొందరైతే కోపంగా కొరకొరా చూస్తున్నారు కూడా.

ఆఖరికి చంద్రలావు కూడా అలా చేస్తాడని నేను అనుకోలేదు.

ఆ రోజు—

చంద్రలావు నాగదికి వచ్చాడు. ఓ రెండు నిముషాలు మాట్లాడిన తరువాత ''కొత్తగా ఈవేళ ఉదయమే ఒక కవిత రాశానోయ్... వింటావా?'' అన్నాను.

మంచం మీదనుండి హఠాత్తుగా లేచి ''వినను గాక వినను'' అని చెప్పుల్లో కాళ్లు దూర్చేశాడు.

నేను వాడి గడ్డం పట్టుకుని బతిమాలాడాను.

''నీకు గ్రీన్ క్యాట్ రెస్టారెంటులో బిర్యాని తినిపిస్తాను'' అన్నాను.

అప్పుడు శాంతించి మంచం మీద కూర్చుని ''చిన్న కవితైతేనే వింటాను'' అన్నాడు చంద్రలావు.

నేను కెవ్వుమని కేకేశాను. ఆ అరుపుకి చంద్రలావు మంచం మీద నుండి దొర్లి క్రింద పడ్డాడు.

బట్టలు దులుపుకుని లేస్తూ ''ఏంటా అరుపులు? నీ కవిత్వం భరించలేక నిన్ను నేను చంపుతున్నానని అనుకోగలరు ఎవరైనా'' అని కోపగించుకున్నాడు.

''ఏం లేదు... ఈ వారం రోజుల్లో నా కవిత్వం వింటానని అన్నది నువ్వొక్కడివే'' అన్నాను సిగ్గుపడుతూ.

''సర్లే సర్లే... చదువు''

''మన స్నేహం మీదే కవిత చదువుతా''

''ఆహా మన స్నేహం
లేదు మన ఇద్దరిలో ద్రోహం.

లేదు ఇద్దరికీ ఏ మాత్రం అహం
మంచితనానికి మనం దాసోహం
ఆహా మన స్నేహం
ఏదైనా మనం సహం సహం
మనకి......"

హఠాత్తుగా నా నోరు మూసేశాడు చంద్రావు. కోపంగా నావైపు చూశాడు. నా చొక్కా జేబు పట్టుకుని లాగాడు. జేబు సరుగ్గిన చిరిగి వాడి చేతిలోకి వచ్చింది. నా చెయ్యిపట్టుకుని "దీంతోనే కదూ నువ్వు కవిత్వం రాసేది?" అని చేతి బొటన వ్రేలు చటుక్కున విరిచి, ఆ చేతిని వెనక్కి తిప్పి మెలి పెట్టాడు. నేను బాధతో బాబోయ్ అని అరిచాను.

వాడు నా చెయ్యి వదలి నా చేతిలోని కవిత్వం లాక్కుని పరపర చింపేసి గదిలోంచి సరుగ్గిన వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు ఇంటి అద్దెకోసం యింటి యజమాని వచ్చాడు. ఆయనకి అద్దె చెల్లించి కుర్చీలో కూర్చోబెట్టి ఓ చిన్న కవిత వినిపించాను.

"ఇలాగయితే లాభం లేదబ్బాయ్. నిన్ను గది ఖాళీ చేయించాల్సి ఉంటుంది" అన్నాడు కోపంగా.

వీళ్లందరికీ నేనంటే ఈర్ష్య — ఎక్కడ పేరు సంపాదించి గొప్పవాడిని అయిపోతానో అని....

ఎవరు చూసినా నాకు దూరం దూరంగా ఉంటున్నారు. ఆఖరికి నా ప్రాణ స్నేహితుడు చంద్రావు కూడా నాకు దూరం అయిపోయాడు. నాలుగు రోజులైనా చంద్రావు నాకు కనిపించలేదు.

ఇలా వంటరిగా వచన కవిగా బ్రతకడం కంటే కవిత్వాన్ని వదిలి అందరికీ దగ్గరవుతూ బ్రతకడం మేలని అనిపించింది నాకు.

ఆఫీసునుండి చంద్రావు యింటికి బయల్దేరాను.

కాలింగ్ బెల్ నొక్కాను.

చంద్రావు తలుపు తెరిచి నన్ను చూసి ధనేల్ మని తలుపు మూసేశాడు.

"ఒరేయ్! నేను కవిత్వం రాయడం మానేశానోయ్." గట్టిగా అరిచాను.

"నిజంగా?" తలుపు తెరవకుండా లోపలి నుండి అడిగాడు.

"నిజంగా... నీమీదొట్టు"

నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి. నేను చంద్రావుని కౌగిలించుకుని బావురు మన్నాను.

"ఊర్కో... ఊర్కో..." చంద్రావు నా వీపు నిమిరాడు.


"నువ్వే కదరా నన్ను కవిత్వం రాయమన్నది" అన్నాను వాడిని మరీ గట్టిగా కౌగిలించుకుని.

"అంటే అన్నానులే... ఇప్పుడొద్దని అంటున్నాగా... ఊరుకో... ఇంక కౌగిలించుకున్నది చాల్లే — వదులు"

నేను వాడిని వదిలేసి చొక్కా ఎత్తి నాకళ్లు తుడుచుకుని చంద్రావు వంక చూశాను. వాడు నావైపు కోపంగా చూస్తున్నాడు.

వాడి చొక్కా మొత్తం ఊడి క్రింద పడి ఉంది. మెడలో మాత్రం పట్టి కాలరు ఉంది.

*




VISWA VANI PUBLIC SCHOOL
WORK IS WORSHIP
విశ్వవాణి పబ్లిక్ స్కూల్
(ఇంగ్లీషు మీడియం)
మారుతీ కాలనీ, పటమట, విజయవాడ-6.
L.K.G నుండి 7వ తరగతి
క్రమేణ 10వ తరగతి స్థాయికి
పునః ప్రారంభం! అడ్మిషన్లు జరుగుచున్నవి!
(గతంలో యస్.వి.నందనరావు B.E., ప్రిన్సిపాల్ చే నడుపబడిన శ్రీ అమరవాణి నికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్ పేరు మార్చబడినది).
* విద్యను, వ్యాపార దృష్టితో కాకుండా, పవిత్రమైన యజ్ఞంగా భావించి అవిరళ కృషి చేస్తున్న సంస్థ.
* ప్రతిరోజు డయరీలో టీచర్, పేరెంట్, సంతకాలతో విద్యార్థి దైనందిన కార్యక్రమాలపై సునిసిత పర్యవేక్షణ.
* క్వార్టర్లీ, హాఫ్‌యర్లీ, ప్రీయాన్యువల్, యాన్యువల్ పరీక్షలే కాకుండా 4-యూనిట్ టెస్టులు...... అస్సైన్‌మెంట్స్.... సింపుల్ టెస్టులు, స్లిప్ టెస్టులు, ప్రతిరోజు హోమ్‌వర్క్.
* లెక్కలు, తెలుగు, గ్రామర్‌తో కూడిన ఇంగ్లీషులలో... ప్రత్యేక కృషి.
* పాత విద్యార్థుల అభివృద్ధి, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలే మా కృషికి గీటురాళ్లు!
ప్రిన్సిపాల్: యస్.వి.నందనరావు B.E.,
RADHIKA
B.BALAZI

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనా సరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం 'దాగ్ వినాశక్' వాడినయెడల మూడు దినములలో మారును అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి
Address:
GAUTAM CHIKITSALAYA (O.P.)
(P.O.) KATRI SARAI (GAYA)

తెల్ల వెంట్రుకల నిర్మూలన
హేర్ డైతో కాదు-సువాసనగల మా ఆయుర్వేద 'పుష్పమాల' అనే తలనూనె పండిన తెల్లవెంట్రుకలను శాశ్వతంగా సహజమైన నల్లరంగులోనికి మార్చుచు మెదడుతో పని చేయువారలకు యిదొక వరం! ఒక కోర్సు రు 40/- పోస్టేజి అదనం
Address:
MYSORE CHIKITSALAYA (T.A.)
(P.O.) KATRI SARAI (GAYA)